# ఎనిమిదో అడుగు

వెంకట్రామయ్య రాసిన ఉత్తరం చదివి చాలా సంతోషించాను.

సృజనకు పెళ్ళి ఖాయమైందని, ఈ ఆదివారంనాడే నిశ్చితార్థం కూడా జరుగుతోందని, కొద్దిమంది మిత్రులను మాత్రమే పిలుస్తున్నానని, మీరు తప్పకుండా రావాలని రాశాడు.

వరుడు ఎం.ఎస్సి పూర్తిచేసి మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నాడు.

వెంకట్రామయ్య నా చిన్ననాటి మిత్రుడు. స్కూల్లో క్లాస్‌మేట్. చాలా క్లోజ్‌గా ఉండేవాళ్లం. చదువు పూర్తయ్యాక చాలా రోజులదాకా మేం కలుసుకోలేదు. బి.ఏ తర్వాత బి.ఎడ్ కూడా పూర్తిచేసి నేను టీచర్‌గా సెటిలయ్యాను. వెంకట్రామయ్య పాలిటెక్నిక్‌లో ఎల్.సి.ఇ చదివి చిన్న చిన్న కాంట్రాక్టులేవో చేస్తున్నాడని తెలిసింది. నేను నల్గొండలో పనిచేస్తున్న రోజుల్లో వెంకట్రామయ్య మళ్లీ కలిశాడు. అతను కూడా నల్గొండలోనే ఉంటున్నాడు. మాకు వాళ్ళింటిపక్కనే ఓ అద్దె ఇల్లు చూశాడు. అలా వెంకట్రామయ్య కుటుంబమూ, మా కుటుంబమూ పక్కపక్కనే ఉంటూ, ఒకరి కష్టసుఖాల్లో ఒకరం పాలుపంచుకోవడం మొదలెట్టాం.

కాంట్రాక్టర్‌గా వెంకట్రామయ్య బాగానే సంపాదించాడు. ఆయనకు ఇద్దరు కొడుకులు, ఒక్కతే కూతురు. ఇద్దరు కొడుకుల్లో పెద్దవాడు సివిల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ సంపాదించి తండ్రితో పాటే కాంట్రాక్ట్ పనులు చేస్తూ తండ్రికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. రెండోవాడికి డొనేషన్ కట్టి కర్నాటకలో మెడిసిన్ చదివిస్తున్నాడు.

ఆ ఇంట్లో అందరికన్నా చిన్నది సృజన. సృజనను కూడా మెడిసిన్ చదివించాలనుకున్నాడు. గుంటూరుకు, నెల్లూరుకు కోచింగ్‌కు పంపించాడు. సృజన రెండుసార్లు ఎంట్రన్స్ రాసినా సీటు రాలేదు. కొడుకునైతే డొనేషన్ కట్టి కర్నాటకలో మెడిసిన్ చదివిస్తున్నాడు. కానీ, కూతురు విషయంలో ఆ పని చెయ్యలేకపోయాడు వెంకట్రామయ్య. ''ఇప్పుడు డొనేషన్ కట్టాలి. రేపు కట్నమూ ఇవ్వాలి. ఏదో ఒకటి చెయ్యగలం కానీ, రెండూ చెయ్యాలంటే నావల్ల కాదు'' అన్నాడాయన. సృజన బి.ఎస్సి చేసింది. తర్వాత ఎం.ఎస్సి కూడా పూర్తిచేసి ఈమధ్యనే హైదరాబాద్‌లో ఏదో ప్రైవేటు కాలేజీలో లెక్చరర్‌గా చేస్తోంది. సృజన ఎం.ఎస్సి చేస్తున్నప్పుడే వెంకట్రామయ్య తన కుటుంబాన్ని హైదరాబాద్‌కు మార్చాడు. నాకు నల్గొండనుంచి సూర్యాపేటకు ట్రాన్స్‌ఫర్

అయింది.

సృజన చూడడానికి అందంగానే ఉంటుంది. చామనఛాయ. సన్నగా పొడుగ్గా ఉంటుంది. కనుముక్కు తీరు బావుంటాయి. కళకళ్లాడే ముఖం. ఒత్తైన జుట్టు. నిండుగా, గుంభనంగా కనిపిస్తుంది. అమ్మాయిని చూడగానే ఎవరైనా 'అమ్మాయి ముఖంలో కళ ఉంది, ముఖవర్చస్సు బావుంది' అనుకుంటారు.

అయినా సృజనకు వరుణ్ణి సంపాదించడంలో వెంకట్రామయ్య కొన్ని సమస్యలు ఎదుర్కొన్నాడు. కొన్ని సంబంధాలు వీళ్లకు నచ్చక, కొన్ని సంబంధాలు వాళ్లకు నచ్చక రెండు మూడేళ్ళనుంచి సృజన పెళ్ళి వాయిదా పడుతూ వచ్చింది.

ఈ మధ్యనే నేను హైదరాబాద్ వెళ్లి వెంకట్రామయ్యను వాళ్ళింట్లోనే కలుసుకున్నాను.

''ఏమిటోరా, ఒక్కగానొక్క కూతురుకు పెళ్ళి చెయ్యలేకపోతున్నాను. మనకేం తక్కువని ఇలా జరుగుతోంది? ఆస్తి తక్కువా? అంతస్తు తక్కువా? అమ్మాయి చదువుకోలేదా? అందంగా లేదా? క్షణాలమీద ఎంతమంది అమ్మాయిలకో పెళ్ళిళ్ళు కుదురుతున్నాయి. మేమేం పాపం చేశాం'' అన్నాడు వెంకట్రామయ్య.

''ఏ పాపమూ చెయ్యకపోవడమే నువ్వు చేసిన పాపం కావచ్చు. టేకిట్ ఈజీ! అప్పుడే ఏం మునిగిపోయిందని అంత బాధపడుతున్నావు? దేనికైనా కాలం కలిసిరావాలి. ఆ టైమ్ వస్తుంది. సృజనకు పెళ్ళి తప్పకుండా కుదురుతుంది'' అన్నాన్నేను.

''నువ్వేన్నన్నా చెప్పు. ఆడపిల్లలకు చిన్నప్పుడే పెళ్ళి చెయ్యాలి. మన పూర్వులు ఆ మాట ఎంతో అనుభవంతో చెప్పారు. మనమే చదువులనీ, చట్టుబండలనీ, అమ్మాయి మానసికంగా ఎదగాలని - ఇలా ఏవేవో ఆదర్శాలు పెట్టుకొని పూర్వుల మాటను పెడచెవిన పెట్టాం'' అన్నాడు వెంకట్రామయ్య.

ఆ మూడ్‌లో వాడికిక ఏం చెప్పినా లాభం లేదని వెంకట్రామయ్య భార్య సుమతితో కాస్సేపు మాట్లాడాను... సుమతి కూడా ఇంచుమించు భర్త ఉన్న మూడ్‌లోనే ఉంది. తాము ఏవో పొరపాట్లు చేశామని, ముఖ్యంగా తన భర్త వెంకట్రామయ్య మొదటే ఇంత కట్నం ఇస్తానని చెప్పకపోవటం, మొదట్లో వచ్చిన సంబంధాల్ని మన తాహతుకు తగిన సంబంధాలు కావని తిరగ్గొట్టడం, వచ్చిన వాళ్లకు సరైన మర్యాదలు చెయ్యకపోవడం, ఎప్పుడూ కాంట్రాక్టు పనుల్లోనే మునిగి తేలుతూ అమ్మాయి పెళ్లి విషయంలో అబ్బాయి తరఫువాళ్ళే మనల్ని వెతుక్కుంటూ వస్తార్లే అన్న ధోరణిని ప్రదర్శించడం - ఇలాంటి కారణాల వల్లనే సృజనకు సంబంధం కుదరడం లేదని ఆమె వాపోయింది.

ఏది ఏమైనా, సృజన పెళ్లి నిర్ణయమైనందుకు చాలా సంతోషించాను.

సృజన ఎంగేజ్‌మెంట్‌కు హైదరాబాద్ వెళ్లాను.

ఎంగేజ్‌మెంటే అయినా, ఓ పెళ్ళిలాగే జరిగింది. బంధువులు, స్నేహితులు చాలామందే వచ్చారు. అబ్బాయి తరఫున మాత్రం అతని తల్లిదండ్రులు, ఇద్దరు

చెల్లెళ్ళు, ముగ్గురు నలుగురు ఫ్రెండ్స్ తప్ప వేరేవాళ్ళెవరూ రాలేదు.

వెంకట్రామయ్య, సుమతి చాలా సంతోషంగా కనిపించారు.

సృజనకు కాబోయే వరుణ్ణి చూశాను. అతని పేరు కిషోర్. చూడటానికి చాలా అందంగానే ఉన్నాడు. ఆరడుగుల ఎత్తు, ఎత్తుకు తగ్గ లావు, ఎర్రగా నిగనిగలాడుతున్న శరీరం, విశాలమైన నుదురు, తళతళ మెరుస్తున్న పెద్ద కళ్ళు, చక్కని ముక్కు, గుబురు మీసాలు, మెడకిందిదాకా వేలాడుతున్న జుట్టు... మధ్య పాపట వెనక్కి దువ్వాడు. టీషర్ట్ మీద టక్ చేశాడు. చూడగానే 'ఎవరీ హాండ్సమ్ గై' అనుకునేలా ఉన్నాడు కిషోర్.

అతని పక్కన సృజన ఎందుకోగానీ చాలా నెర్వస్‌గా, అనీజీగా, బిడియంగా కనిపించింది. ఆమెలో సహజంగా ఉండే ఆకర్షణ, ఆ గ్రేస్ ఎందుకో ఆ క్షణంలో మాయమైపోయినట్లనిపించింది. అతను చాలా పొడుగ్గా ఉండటంవల్ల అతని పక్కన నిల్చున్న సృజన పొట్టిదానిలా కన్పించింది. కలర్ విషయంలో కూడా అతనితో పోలిస్తే ఒక ఛాయ తక్కువే. ఈ కారణాల వల్లనే కావచ్చు సృజనలో తని పక్కన నిల్చున్నంత సేపు ఏదో ఇన్‌ఫీరియారిటీ ఫీలింగ్ ప్రవేశించినట్లనిపించింది.

నన్ను చూడగానే సృజన, ''నమస్తే అంకుల్'' అని నవ్వింది. ఆమె నిశ్చితార్థం అనే తంతు పూర్తయ్యేదాకా అలా నవ్వుతూనే ఉంది. కానీ, ఆమె నవ్వులో ఎప్పుడూ కనిపించే సహజత్వం లేదు. నిండుతనం లేదు. ఆమె లోపల ఏదో సంఘర్షణ జరుగుతున్నట్టుగా, దాన్ని కప్పిపుచ్చుకోవడానికే ఆమె నవ్వుతున్నట్లుగా తోచింది నాకు.

భోజనాలయిపోయినాక నేను కాస్సేపు సృజనతో మాట్లాడాను.

''ఆర్ యూ హ్యాపీ సృజనా'' అన్నాను.

''నేను హ్యాపీగా ఉండటంగానీ, ఉండకపోవడంగానీ ఎవరికి కావాలంకుల్? వాళ్ళకు కావల్సింది నేను పెళ్ళి చేసుకోవడం. నాకు పెళ్ళి చేసే బాధ్యతను తీర్చుకున్నామన్న తృప్తి కావాలి. కూతురి పెళ్ళి చేశాడన్న మెప్పు కావాలి. నా హ్యాపీనెస్ ఎవరిక్కావాలి'' అంది సృజన.

''అదేమిటి సృజనా, అలా మాట్లాడుతున్నావు. నీకీ సంబంధం నచ్చలేదా?''

''నచ్చిందనీ చెప్పలేను, నచ్చలేదనీ చెప్పలేను''

''అదేం మాట, నచ్చడమో, నచ్చకపోవడమో - ఏదో ఒకటి జరగాలిగా''

''నచ్చాడని ఎలా చెప్పను? ఎవరినైనా ఒకసారి మాత్రమే చూసి నచ్చాడని చెప్పగలవా? అతడేమిటో, ఎలాంటివాడో, అతని లోపలేముందో, అతని అలవాట్లు, అభిరుచులు ఏమిటో నాకేం తెలుసు? అలాగే అతడు నచ్చలేదని చెప్పడానికి కూడా నాకే కారణమూ కనిపించడం లేదు. చూడడానికి బాగానే ఉన్నాడు. బాగా చదువుకున్నాడు. ఏదో ఒక ఉద్యోగం కూడా ఉంది. ఏ పెళ్ళికూతురైనా ఇంతకంటే ఏం కోరుకుంటుంది'' అంది సృజన.

''కరెక్టే, నాకు ఇది మంచి సంబంధమేననిపిస్తోంది. అయితే, మ్యారేజెస్‌లో కొంత రిస్క్ ఎలాగూ ఉంటుంది. మ్యారేజ్ ఈజ్ ఎ గాంబ్లింగ్. లెటజ్ హోప్ ఫర్ ది బెస్ట్'' అన్నాను.

''థాంక్యూ అంకుల్'' అంది సృజన.

వెంకట్రామయ్య నన్ను చూడగానే గట్టిగా కౌగిలించుకున్నాడు.

''నువ్వనేది కరెక్టేరా. దేనికైనా కాలం కలిసిరావాలి'' అన్నాడు.

''అది సరేగానీ, కట్నం ఎంతిస్తానన్నావు'' అన్నాను.

''వాళ్లు అయిదడిగారు. నేను నాలుగు వరకిస్తానన్నాను. చివరకు నాలుగున్నర, ఓ ఒక హీరోహోండాతో సెటిలయిపోయింది. అంతా చాలా సడెన్‌గా జరిగిపోయింది. నీకు కబురు చేసే టైమ్ కూడా లేకపోయింది. నాకైతే ఈ సంబంధం పూర్తిగా నచ్చింది. 'మెడికల్ రిప్రజెంటేటివ్‌కా ఇవ్వడం' అని సుమతి కొంచెం గొణిగిందనుకో. కానీ, అతడు ఆ ఉద్యోగం మానేసి ఇక్కడే హైదరాబాద్‌లో సొంతంగా ఓ ప్రైవేట్ కాలేజీ పెడ్తాడట. అబ్బాయి మంచివాడు. ఈడు, జోడు బావుంది. అత్తా, ఆడబిడ్డల గొడవ లేదు. వాళ్ళెక్కడో పల్లెటూర్లో ఉంటారు. అతని సిస్టర్స్ చాలా చిన్న పిల్లలు. వాళ్లతో అమ్మాయికెలాంటి సమస్యలూ రావు. అతడు ప్రస్తుతం నిజామాబాద్‌లో పనిచేస్తున్నాడు. పెళ్ళి కాగానే కాపురం కూడా అక్కడే పెడ్తాడట''

''మంచిదే'' అన్నాను. కొంచెంసేపు సుమతితో మాట్లాడాను. అతను చేస్తున్న జాబ్ విషయంలో తప్ప మిగతా విషయాల్లో ఆమెకూడా సంతోషంగానే ఉంది. అతడు త్వరగా హైదరాబాద్ వచ్చేసి తాను స్వయంగా ఏదన్నా కాలేజీ పెట్టడమో లేదా ఏదన్నా ప్రైవేట్ కాలేజీలో లెక్చరర్‌గా చేరడమో చేస్తే బావుండునన్న అభిప్రాయాన్ని సుమతి వ్యక్తం చేసింది.

ఎంగేజ్‌మెంట్ జరిగిన రోజే పెళ్ళి ఏ రోజున జరగాలో నిర్ణయమైంది. సరిగ్గా నెల రోజుల తర్వాత పెళ్ళి.

సృజన పెళ్ళికి నేను కుటుంబ సమేతంగా వెళ్ళాను.

పెళ్ళి చాలా గ్రాండ్‌గా జరిగింది.

అయిదారువేలమంది దాకా గెస్టులొచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ముఖ్యులంతా ఆ పెళ్ళికే వచ్చారా అనిపించేటట్లుగా బోల్డుమంది వి.ఐ.పిలు, వి.వి.ఐ.పిలు కనిపించారు. పదిమందిదాకా ఎం.ఎల్.ఏలు, ముగ్గురు మంత్రులు, వాళ్ళచుట్టూ వాళ్ళ ఆశ్రితులు, పార్టీ కార్యకర్తలు, వాళ్ళ సెక్యూరిటీ కోసం నియమించబడ్డ గన్‌మ్యాన్లు, ఒక దశలో కల్యాణ మండపంలో ఎక్కడ చూసినా గన్‌మ్యాన్లే కనిపించారు. ఇంకా ఊళ్ళో ఉన్న డాక్టర్లు, ప్లీడర్లు, సినిమా నటులు, పోలీసు ఆఫీసర్లు, యూనివర్శిటీల్లో పనిచేసే ప్రొఫెసర్లు, రీడర్లు, లెక్చరర్లు, ఆర్ అండ్ బికి చెందిన ఇంజనీర్లు, సూపర్‌వైజర్లు, కాంట్రాక్టర్లు - ఇలా సిటీలో ఉన్న అప్పర్ మిడిల్ క్లాస్ మొత్తం ఆ పెళ్ళికి వచ్చేశారా అనిపించింది.

పెళ్ళికొచ్చిన వాళ్ళంతా ఏకకంఠంతో పెళ్ళి గ్రాండ్‌గా జరిగిందన్నారు. ఇంత పలుకుబడి ఉన్న మామగారికి అల్లుడు కావటం పెళ్ళికొడుకు అదృష్టం అన్నారు. పెళ్ళి కూతురు కూడా అదృష్టవంతురాలే అన్నారు. అందమైన పెళ్ళికొడుకు దొరికాడన్నారు.

నేను సృజనను అత్తవారింటికి పంపించేంతవరకు ఉన్నాను. ఎంగేజ్‌మెంట్ రోజు సృజన ఎలా ఉందో ఈరోజు కూడా అలాగే ఉంది. చాలా నెర్వెస్‌గా, దేన్ని గూర్చో భయపడుతున్నట్లుగా కనిపించింది. పెళ్ళి అనేది స్త్రీ జీవితంలో ఒక గొప్ప మలుపు. ఇంతవరకు గడిపిన జీవితానికి పూర్తిగా భిన్నమైన జీవితంలోకి అడుగుపెట్టాలి. తన సర్వస్వాన్ని వదిలేసి ఒక ఆగంతకుణ్ణి నమ్మి అతనితో వెళ్లిపోవాలి. తన సర్వస్వాన్ని అతనికి అర్పించుకోవాలి. అతడెలాంటివాడైనా, అతనితో శేషజీవితాన్ని గడిపెయ్యాలి. బహుశా సృజన ఈ విషయాలను గూర్చి ఆలోచిస్తున్నదేమో!

కారెక్కేముందు సృజన నా దగ్గరకొచ్చింది. చాలా అలసిపోయినట్లుగా కనిపించింది.

''నీ జీవితంలో ఇది పెద్ద మలుపు సృజనా! ధైర్యంగా ఉండాలి. నిన్ను చూస్తోంటే చాలా టెన్షన్‌లో ఉన్నట్లు అనిపిస్తోంది...''

''అవునంకుల్... ఎందుకోగాని చాలా భయం వేస్తోంది'' ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

''రిలాక్స్ సృజనా! రిలాక్స్! మరీ ఎక్కువగా ఆలోచించకు. ఎవ్రీథింగ్ విల్ బి ఆల్‌రైట్. హాయిగా వెళ్ళిరా'' అన్నాను.

''అలాగే అంకుల్'' అంది సృజన.

''ఆల్ ది బెస్ట్ సృజనా'' అన్నాను.

''థాంక్యూ అంకుల్'' అంటూ సృజన కారెక్కింది.

* * *

రెండు నెలలు గడిచాయి.

కిషోర్, సృజనలు నార్తిండియాకు, ఢిల్లీ, సిమ్లా, ఆగ్రా మొదలైన ప్లేసెస్‌కు హానీమూన్‌కు వెళ్లొచ్చారని తెలిసింది.

కిషోర్ చేస్తున్న మెడికల్ రిప్రజెంటేటివ్ ఉద్యోగం మానేసి హైదరాబాద్‌లో కట్నం డబ్బుతో ఇంకో ఇద్దరు పార్టనర్స్‌తో కలిసి ఒక రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ పెట్టాడని తెలిసింది. కిషోర్, సృజనలు హైదరాబాద్‌లోనే కాపురం పెట్టారట.

ఒకసారి హైదరాబాద్ వెళ్ళి సృజనను కలిశాను.

''మ్యారీడ్ లైఫ్ ఎలావుంది సృజనా'' అన్నాను.

''ఫరవాలేదంకుల్'' అంది సృజన.

సృజన మాటల్లో ఉత్సాహం కనిపించలేదు.

ఆమె ముఖంలో ఇదివరకటి చైతన్యమూ, జీవమూ, ఆత్మవిశ్వాసమూ కనిపించలేదు.

''ఈజ్ ఎనీథింగ్ రాంగ్ సృజనా'' అన్నాను.

''ఏమీ లేదంకుల్... ఒంట్లో బావుండడం లేదు. అంతే'' అంది సృజన. కానీ, సృజన ఏదో దాస్తోందనిపిస్తోంది నాకు.

''నా దగ్గర కూడా దాపరికమేనా? నీ భర్తతో అడ్జస్ట్ కావడంలో ఏమైనా సమస్యలా'' అన్నాను.

''అలాంటిదేమీ లేదంకుల్''

''పెళ్ళయిన కొత్తలో ఎవరికైనా అడ్జస్ట్‌మెంట్‌కు కొంచెం టైమ్ పడుతుంది. ఇద్దరు అపరిచితులకు సడన్‌గా పెళ్ళి చేసేసి జీవితాంతం సహజీవనం చెయ్యమంటుంది సమాజం. ఒకర్నొకరు తెలుసుకొని, ఒకరి బలహీనతల్ని ఒకరు సానుభూతితో అర్థం చేసుకొని సాఫీగా కాపురం చెయ్యడానికి కొంచెం టైమ్ పడ్తుంది'' అన్నాను.

''నేనతనితో అన్నివిధాలా అడ్జస్ట్ కావడానికే ప్రయత్నిస్తున్నానంకుల్. అతడు నన్ను నేను చేస్తున్న ఉద్యోగం మానెయ్యమన్నాడు. ప్రైవేట్ కాలేజీలోనే కదా, వాళ్ళిస్తున్నది కూడా చాలా తక్కువే కదా అని అమ్మానాన్నలు కూడా మానెయ్యమన్నారు, మానేశాను''

''అదేమిటి? నీ జీవితానికి సంబంధించిన నిర్ణయాలు నువ్వు తీసుకోవాలిగానీ, అతడుగానీ, మీ అమ్మానాన్నగానీ తీసుకోవడమేమిటి? అడ్జస్ట్‌మెంటంటే మన వ్యక్తిత్వాన్ని, స్వయం నిర్ణయాధికారాన్ని చంపుకోవడం కాదు'' అన్నాను.

''పోనీయండంకుల్, ఉద్యోగం కంటే కాపురం ముఖ్యం కదా''

''రెండూ ముఖ్యమే''

''రెండింట్లో ఏదో ఒకదాన్ని మాత్రమే ఎంచుకోవాల్సి వస్తే దేన్ని ఎంచుకోమంటారంకుల్?''

''ఇలాంటి విషయాల్లో ఎవరికివాళ్ళే నిర్ణయం తీసుకోవాలి. బయటివాళ్ళు వాళ్ళ నిర్ణయాల్ని మన నెత్తిమీద రుద్దకూడదు''

''నేనైతే కాపురాన్ని ఎంచుకుంటాను''

''అది పూర్తిగా నీ నిర్ణయమైతే నేను హర్షిస్తాను''

''నా నిర్ణయాన్ని నన్నెప్పుడు తీసుకోనిచ్చారు గనుక ఇప్పుడు తీసుకోనిస్తారు. పుట్టినప్పటినుంచి ఇప్పటివరకూ నా ప్రతి కదలికనూ నిర్ణయించే వాళ్ళున్నప్పుడు నేనెలా నిర్ణయం తీసుకోగలను?''

సృజన మాటల్లో ధ్వనిస్తున్న నిర్వేదాన్ని అర్థం చేసుకోగలిగాను కానీ, ఆమెలో ఆత్మవిశ్వాసాన్ని ఎలా నూరిపోయాలో నాకర్థం కాలేదు.

''ఏవైనా మైనర్ డిఫరెన్సెస్ ఉంటే అవే సర్దుకుంటాయి. నేను మళ్లీ నెల రోజుల తర్వాత వస్తాను. అప్పుడైనా ఇప్పుడు నీలో కనిపిస్తున్న ఈ ఔదాసీన్యం పోయి జీవితంపట్ల ఉత్సాహం ఏర్పడుతుందని ఆశిస్తాను. లెటజ్ హోప్ ఫర్ ది బెస్ట్'' అంటూ సృజనతో సెలవు తీసుకొని వచ్చేశాను.

నేను సృజన దగ్గరకు వెళ్ళొచ్చిన సరిగ్గా నెల రోజుల తర్వాత నాకో పెద్ద ఉత్తరం రాసింది.

కవరు చించి చదివాను.

''డియర్ అంకుల్,

మీరు సరిగ్గా నెల రోజుల తర్వాత వస్తానని వెళ్ళారు. జీవితంపట్ల ఉత్సాహాన్ని పెంచుకోమని సలహా ఇచ్చారు. ఈ నెల రోజుల్లో నాకు జీవితంపట్ల ఉత్సాహం పెరగకపోగా నిరాశా, నిస్పృహలు పెరిగిపోయాయి. మీరు తప్ప నన్నీ ప్రపంచంలో ఎవరూ అర్థం చేసుకోలేరన్న నమ్మకంతో మీకీ ఉత్తరం రాస్తున్నాను. ఈ ఉత్తరం మొత్తం చదివాక నేను చేసింది తప్పో, ఒప్పో నిర్ణయించండి.

నేను, కిషోర్ చాలా హాయిగా కాపురం చేస్తూ రోజుల్ని క్షణాల్లా గడిపేస్తూ ఉంటామని మా పెళ్ళికొచ్చిన చాలామంది అనుకుంటూ ఉంటారు. మీరుకూడా అలాగే అనుకుంటే మీకీ ఉత్తరం పెద్ద షాక్ అవుతుంది. నిజమే - కిశోర్‌లో పైకి చూడటానికి ఏ లోపమూ లేదు. అందగాడు, చదువుకున్నవాడు, జీవితాన్ని అనుక్షణమూ ఎంజాయ్ చెయ్యాలనుకునేవాడు. ఆస్తిపాస్తులకేం కొదవలేదు. అత్త, ఆడబిడ్డల పోరులేదు.

అతనికి భార్యంటే ఇష్టమే. ఎంతిష్టమంటే, ఆమెను ఒక్క క్షణం కూడా వదిలిపెట్టలేనంత ఇష్టం. అతనికి ఇరవై నాలుగు గంటలూ భార్య పక్కనుండాలి. అతనికి భార్య మనసు అక్కర్లేదు. కానీ, ఆమె శరీరం కావాలి. భార్య శరీరంలో ప్రతి అణువూ తనదేనని అతని నమ్మకం. భార్య శరీరంతో ఆడుకోవడానికి, అనుభవించడానికి, హింసించడానికి అతనికి సమాజం లైసెన్సు ఇచ్చిందని అతడనుకుంటాడు. భార్య శరీరాన్ని ఎంత హింసిస్తే అతనికంత తృప్తి.

ఈ సమస్యను నేనెవరితో చెప్పుకోవాలి?

క్లోజ్ ఫ్రెండ్స్‌తో చెప్పుకుంటే, పెళ్ళయిన కొత్తలో మగవాళ్ళు అలాగే చేస్తారు. మనం కొంచెం ఓపిక పట్టాలని సలహా ఇచ్చారు.

ఎంతకాలమని ఓపిక పట్టను?

అతడింత కాలం ఎలా బతికాడో తెలీదు. ఈ మూడు నెలల్నుంచి మాత్రం అతడు నా శరీరాన్ని తిని, నా రక్తం తాగి బతుకుతున్నాడు. అతడు నాకిప్పుడు అందరిలాంటి మనిషిలా కనిపించడం లేదు. రక్తం తాగే పులిలా, తోటి మనుషుల మాంసాన్ని తిని బతికే కానిబాల్‌లా కనిపిస్తున్నాడు.

అతడికి ఎప్పుడూ అదే ధ్యాస. రాత్రీ, పగలూ తేడా లేదు. నాకిష్టమున్నా లేకపోయినా అతనికి సంబంధం లేదు. నేనేమైపోయినా అతనికక్కరలేదు. నా శరీరం నుజ్జునుజ్జయిపోతున్నా, నా ఎముకలు విరిగిపోతున్నా అతడు చేసిన గాయాలతో నా శరీరమంతా రక్తసిక్తమైపోతున్నా అతనికి నా మీద జాలి కలుగదు. ఒక భర్త ఒక భార్యను ఇంత భయంకరమైన హింసకు గురిచేస్తాడని నేను కలలో కూడా హించలేదు.

మొదటి పదిహేను రోజులు నేనీ హింసను ఓపిగ్గానే, నా శరీరంలో ఉన్న సర్వశక్తుల్నీ కూడదీసుకుని భరించాను. కొత్తలో ఇలాగే ఉంటుందేమోనని, తర్వాత మారకపోతాడా అని అనుకున్నాను. మొదటి రాత్రే నేనతనితో చెప్పడానికి ప్రయత్నించాను. మొదట మానసికంగా మనం ఒకర్నొకరం అర్థం చేసుకుందాం - మనసులు కలిసిన తర్వాతే మనం శారీరకంగా కలుద్దాం. ఈరోజు మనం ఫ్రీగా మాట్లాడుకుందాం. నేనిలా చెబుతుండగానే అతడు నామీదకు పంజా విసిరాడు. అతడి బలమైన చేతుల్తో నన్ను బంధించాడు. కోడిపిల్లను గద్ద తన్నుకుపోయినట్లుగా అతడు నా శరీరాన్ని నా నుంచి తన్నుకుపోయాడు.

అప్పట్లో మీరు కలిసినప్పుడు 'ఎలా ఉంది నీ మ్యారీడ్ లైఫ్' అంటే 'ఫరవాలేదు - బాగానే ఉంద'ని చెప్పాను. అప్పట్లో నాకింకా అతడు మారకపోతాడా అన్న ఆశ ఉండేది.

ఎవరితో చెప్పుకున్నా ఈ సమస్య వాళ్లకో సమస్యలా కనిపించడం లేదు. అంతా విని నవ్వేసి ఊరుకుంటున్నారు. ఇదో మైనర్ ప్రాబ్లెమ్ మాత్రమే నంటున్నారు. నువ్వే సమస్యను ఎగ్జాగరేట్ చేసుకుంటున్నావంటున్నారు. నేనేం చెయ్యను? ప్రతిరోజూ నా శరీరం కొవ్వొత్తిలా కాలి కరిగిపోతోంటే, వీళ్ళకు చీమకుట్టినట్లు కూడా లేదు.

పదిహేను రోజుల తర్వాత నేను కొంచెం రెస్ట్ తీసుకుందామని అమ్మా వాళ్ళింటికెళ్తే నా వెంటే అతడు. మా ఇంట్లో కూడా పక్కనే, కొన్ని అడుగుల దూరంలోనే. చిన్నప్పటినుంచీ నన్ను పువ్వుల్లో పెట్టి పెంచిన మా అమ్మ, నాన్న ఉన్నప్పటికీ నన్నతడు అలాగే తన ఇష్టమొచ్చినట్లుగా హింసించడం... ఎంత దయనీయమైన పరిస్థితి. నేనెంత నిస్సహాయురాలిని. నా మెడలో అతడు మూడు ముళ్ళు వేయడం వల్లనే అతనికింత బలం. నేనెంత బలహీనురాలిని? పెళ్ళి అనే పేరుతో నన్నతనికి పూర్వం ఓ బానిసను అమ్మినట్లుగా అమ్మేశారు.

ఇలా రాస్తున్నానని నన్నో ఫ్రిజిడ్ ఉమన్‌గా భావించకండి. నాకు నచ్చిన పురుషుడితో కలిసి ఉండటం ఇష్టమే. భార్యాభర్తలు మానసికంగా ఒక్కరై, తర్వాత శారీరకంగా ఒక్కరై పోవడంలోని మహదానందాన్ని పొందాలని నేనూ ఆశపడ్డాను. కానీ, భార్య అంగీకారంతో ప్రమేయం లేకుండానే ఇరవై నాలుగు గంటలూ ఆమె శరీరంమీద నాకు హక్కు ఉందనుకునే భర్త దొరికినప్పుడేం చెయ్యాలి?

అతనికి సెక్సనేదొక పర్వర్షన్‌గా మారిపోయింది. అతడు కోరుకునేది ఆరోగ్యకరమైన, సహజమైన సెక్స్ కాదు. అసహ్యమైన, భ్రష్టమైన సెక్స్ కోరికలు అతనికున్నాయి. అతడి

కోరికల్ని రాతలో పెట్టి ఈ అక్షరాల్ని పాడుచెయ్యలేను.

అతనితో ఎన్నోసారు చెప్పాను. ''మీరిలాగచేస్తే నేను చచ్చిపోతాను'' అన్నాను.

''ఈ ఒక్కసారే... ప్లీజ్... ఒక్కసారే... మళ్లీ అడగను - అర్థం చేసుకో... ప్లీజ్'' అంటాడు.

ఎన్నోసార్లు అతడు నిద్రపోతున్న టైమ్‌లో పక్కరూమ్‌లోకెళ్ళి ఫ్యానుకు ఉరేసుకుని చచ్చిపోదామా అని ఆలోచించాను. కానీ, అమ్మా, నాన్న నా కోసం ఎంత బాధపడ్తారో! వాళ్ళకోసం బతకాలనిపించింది. ఎలాగైనా ఇతడి గుప్పిట్లోంచి పారిపోలేనా అని ఆలోచించాను. అతనితో 'మరోసారి నువ్విలా చేస్తే నేను నీతో ఉండను' అని చెప్పేశాను.

''ఉండక ఏం చేస్తావు'' అన్నాడు.

''వెళ్ళిపోతాను - నిన్ను వదిలేస్తాను. నువ్వు నీ ఇష్టమైనదాన్ని చూసి చేసుకో. కావాలంటే నాకు అభ్యంతరం లేదని రాసిస్తాను'' అన్నాను.

''వెళ్ళిపోతాను... వెళ్ళిపోతాను అంటున్నావు - ఎక్కడకెళ్తావు? మీ అమ్మా నాన్నల దగ్గరకెళ్తే వాళ్ళు నిన్ను మళ్ళీ నా దగ్గరికి తీసుకొస్తారు. అయిదారేళ్ళు తిరిగి తిరిగీ, ఎన్నో సంబంధాలు చూసి చూసీ చివరకు నాకిచ్చి చేశారు. నువ్వు నన్ను వదిలేశావంటే మొట్టమొదట మీ నాన్న ఉరేసుకు చస్తాడు. ఆ షాక్‌తో మీ అమ్మ చస్తుంది. లోకమంతా నిన్నే తిడ్తుంది. ఆ అబ్బాయిలో ఏం లోపం ఉందని ఈమె అతన్ని వదిలేసింది అంటారు. బంగారం లాంటి అబ్బాయి. అతన్ని వదిలేస్తుందా? అంటారు. స్త్రీవాదమనీ, ఆ వాదమనీ, ఈ వాదమనీ బాగా చదువుకున్న ఆడపిల్లలకే ఇలాంటి పెడబుద్ధులు పుడ్తున్నాయంటారు. నువ్వసలు ఎవరితోనైనా ఏమని చెప్పుకుంటావు? 'నా భర్త నన్ను ఇరవై నాలుగు గంటలూ కావాలంటున్నాడు' అని చెప్పుకుంటే విన్నవాళ్ళెవరైనా 'మంచిదేగా' అంటారు. ఏ స్త్రీ అయినా ఇంతకంటే కోరుకునేదేముంటుంది అంటారు. పరస్త్రీలతో అయితే పోవడం లేదుగా అంటారు. కాబట్టి పిచ్చి పిచ్చి ఆలోనచలు మానేసెయ్. నేను తప్ప నీకు ఇంకో దారి లేదు'' అన్నాడు.

ఒకసారి అతడు బయటకు వెళ్ళిన టైములో నేను త్వరగా తయారై నా ముఖ్యమైన సామాన్లన్నీ సర్దుకుని, అతనికో లెటర్ రాసిపెట్టి పక్కింటివాళ్ళకు తాళం చెవులిచ్చేసి, టాక్సీ మాట్లాడుకుని మా అమ్మా వాళ్ళింటికొచ్చేశాను. నాకోసం మళ్ళీ రావద్దని, నీకూ నాకూ ఇక ఏ సంబంధమూ లేదని, నీకిష్టమైనదాన్ని నీ కోరికలన్నీ తీర్చేదాన్ని చూసుకొని పెళ్ళి చేసుకోవచ్చుననీ, కావాలంటే నేను విడాకుల పత్రం మీద సంతకం పెడ్తానని అతనికి రాసిన ఉత్తరంలో రాశాను. ఇది చదువుకుని కొంతకాలం నా జోలికి రాకుండా పోతాడేమోనని, నాకీ ఖైదు తప్పుతుందేమోననీ ఆశించాను.

కానీ, నేనలా వెళ్ళి కూర్చున్నానో లేదో అతడు మా అమ్మావాళ్ళింట్లో ప్రత్యక్షమయ్యాడు.

''ఏం జరిగిందే'' అని అమ్మ అడుగుతుంటే -

''ఏమీ జరగలేదు'' అనే చెప్పాను.

నేను అతనితో కాపురం చెయ్యననీ, విడాకులు తీసుకోవడం తప్ప నాకు మరో దారి లేదని నాన్నతో, అమ్మతో ఎలా చెప్పను? పెళ్ళయి మూడు నెలలు కూడా కాలేదే! కూతురు పెళ్ళి చేసి, గొప్ప బాధ్యతను తీర్చుకున్నామని ఎంతో సంతోషిస్తున్న వాళ్ళ గుండెల్లో ఈ బాంబును ఎలా పేల్చను? నా సమస్య ఇదీ అని చెబితే వాళ్ళు అర్థం చేసుకుంటారా? పదేళ్ళుగా నాన్న సంపాదించిన ఆస్తినంతా అమ్మి అతనికి కట్నం రూపంలో అయిదు లక్షల రూపాయలిచ్చాడు. ఆ డబ్బంతా అతన్నుంచి రాబట్టుకోవటం ఎలా? నేను అతనితో విడిపోవడానికి నిర్ణయించుకున్నానని చెబితే నాన్న ఎంతగా కుంగిపోతాడో ఊహించలేకపోయాను. అందుకే ఎవరికీ ఏమీ చెప్పకుండా గదిలోకెళ్ళి పడుకున్నాను.

ఏమీ జరగనట్టుగానే ఆ రాత్రి అతడు నేను పడుకున్న గదిలోకొచ్చాడు. ఆ రాత్రంతా అతనితో పోట్లాడాను.

నీకూ నాకూ ఇక కుదరదని చెప్పాను. బలవంతంగా నా శరీరాన్ని మరోసారి ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తే నా శవాన్నే చూస్తావని చెప్పాను.

''చావడం మనం అనుకున్నంత సులభం కాదు'' అన్నాడతడు, నా మీదకు రాబోతూ.

''ఆగు! ఒక్క అడుగు ముందుకొచ్చావంటే ఇప్పుడే, ఈ క్షణమే తల బాదుకుని చచ్చిపోతాను'' అంటూ నా తలను గోడకేసి కొట్టుకోవడం మొదలెట్టాను. నొసలు చిట్లి రక్తం కారింది. అతడు వెంటనే ఆగిపోయాడు.

ఆ రాత్రంతా నేను మేలుకునే ఉన్నాను.

''ఎవరికీ ఏమీ చెప్పకుండా నువ్వెళ్ళిపో. తెల్లారాక నువ్వింకా మా ఇంట్లో ఉన్నావంటే నీ మర్యాద దక్కదు'' అని చెప్పానతనికి.

ఆ మర్నాడతను మా నాన్నతో చాలాసేపు మాట్లాడాడు. కొత్తగా పెళ్ళి చేసుకున్న దంపతులు ఎప్పుడూ కలిసి ఉండాలని కోరుకుంటే తప్పా? ఆమె ఎప్పుడూ నా పక్కనే ఉండాలనుకున్నాను. అదే నేను చేసిన నేరమా? ఈ ధోరణిలో మాట్లాడాడు. నాన్నకు అతడిమీద బోలెడు జాలి కలిగింది. తప్పంతా నాదే అనుకున్నాడు. అమ్మకూడా అలాగే అనుకుంది. నా ఇంటికొచ్చి నన్ను కని పెంచి పెద్ద చేసిన నా తల్లిదండ్రుల్నే నన్నర్థం చేసుకోకుండా చేసిన అతన్ని చూస్తే నాకెంత కంపరమెత్తిందో చెప్పలేను.

అమ్మానాన్నలు ''ఇంత సున్నితమైతే ఎలా'' అని నాకే బోధలు చెయ్యడం మొదలెట్టారు.

''నేను అతనితో ఇంకో నెల రోజులు కాపురం చేస్తే నేను మీకిక ఏమీ మిగలను.

దయచేసి నన్ను మళ్ళీ అతని దగ్గరకు పంపించకండి'' అని నేను వాళ్ళకు చేతులెత్తి దండం పెట్టాను. అతడు నన్నెంత హింసించాడో అమ్మకు చెప్పాను. అయినా, వాళ్ళకు నా మీద జాలి కలగలేదు. మగవాళ్ళు మొదట్లో ఇలాగే చేస్తారు. తర్వాత మారతారు. నాలుగు రోజులు ఓపికపడ్తే అన్నీ సర్దుకుంటాయి. పెళ్ళైన మూడు నెలలకే విడిపోయారంటే లోకం ఏమంటుంది? అంతమందిని పిలిచి, అంత వైభవంగా పెళ్ళి చేశాం. విడాకులు తీసుకున్నారంటే మన పరువు ప్రతిష్టలు మంటగలసిపోవూ? పదేళ్ళ నా శ్రమనంతా అతనికి కట్నం రూపంలో ఇచ్చాను. ఇప్పుడు నువ్వే అతన్ని కాదంటే, అతడు మనకు ఒక్కపైసా కూడా ఇవ్వడు - ఇలా అమ్మానాన్నలిద్దరూ మూడు నాలుగు రోజులు నన్ను బతిమిలాడారు. ఏడ్చారు. కాళ్ళావేళ్ళా పడ్డారు. నేనూ ఏడ్చాను. కాళ్ళావేళ్ళా పడ్డాను. ''నాకు పెళ్ళక్కర్లేదు, కాపురం అక్కర్లేదు - నన్ను బతకనీయండి చాలు'' అని ప్రాధేయపడ్డాను. ఆర్థికంగా నేను మీకు భారం కానని చెప్పాను. అయినా, వాళ్లకు నా మీ జాలి కలుగలేదు. నా ప్రాణం కంటే వాళ్లకు వాళ్ళ పరువు ప్రతిష్టలే ముఖ్యమైనాయి.

అతడు కూడా ''నేను ఇదివరకటిలా చెయ్యను. నీ అంగీకారం లేకుండా నేను నీమీద చెయ్యికూడా వెయ్యను. నన్ను నమ్ము'' అంటూ నెత్తిమీద చేతులు పెట్టుకొని ప్రమాణం చేశాడు. ''ఇప్పట్నుంచి మనం భార్యాభర్తలుగా కాకుండా అన్నాచెల్లెళ్ళలాగా జీవిద్దాం'' అన్నాడు. ఎంతో బుద్ధిమంతుడిలా నటించాడు.

మూడురోజుల తర్వాత నన్ను మళ్ళీ అతనితో హైదరాబాద్ పంపించారు (అమ్మావాళ్ళు సికిందరాబాద్‌లో ఉంటున్నారు).

ఈసారి వెళ్లాక అతడు రెండ్రోజులు మాత్రమే నార్మల్‌గా ఉన్నాడు. మూడోరోజునుంచి మళ్ళీ ఎప్పటిలాగే - డ్రగ్స్ అలవాటుపడిపోయినవాడిలా... తాగుడుకూ, జూదానికి బానిసైపోయినవాడిలా ప్రవర్తించసాగాడు. అతడో పర్వర్ట్... మేనియాక్... బీస్ట్... అతడుండవలసింది ఇంట్లో కాదు, హాస్పిటల్లో...

రెండ్రోజులు అతని చిత్రహింసలు అనుభవించాక అతనితో అన్నాను. ''యూఆర్ నాట్ ఎ నార్మల్ హ్యూమన్ బీయింగ్. మనమొకసారి సైకియాట్రిస్ట్ దగ్గరకు వెళ్దాం. సైకియాట్రిస్ట్ దగ్గకరకు రావడం నామోషీ అనుకోకండి''

అతడు 'సైకియాట్రిస్ట్' అన్న మాట వినగానే రెచ్చిపోయాడు.

''నన్ను - నన్ను సైకియాట్రిస్ట్ దగ్గరకు రమ్మంటావా? ఎంత గర్వమే నీకు! బాగా చదువుకున్నదాన్నని, లక్షాధికారి కూతుర్నని ఎంత పొగరే నీకు! నీ గర్వాన్ని అణచడానికొకటే మార్గం...'' అంటూ రాయడానికి వీల్లేని భాషలలో తిట్టడం మొదలెట్టాడు. ''నీ గర్వాన్ని చూసేనే నేను నీపట్ల ఇంత మొరటుగా మారింది. ఏం చూసుకునే నీకింత గర్వం? నీ గర్వాన్ని అణచివెయ్యకపోతే నాకు మనశ్శాంతి ఉండదు'' అంటూ అతడు నామీదకొచ్చాడు. నేనెంత పోరాడినా, ఈసారతన్ని తప్పించుకోలేక

పోయాను. అతని పశుబలంతో నన్ను లొంగదీసుకుని, అతని బుద్ధిదీరా హింసించి హింసించి నా శరీరాన్ని తునాతునకలు చేసి, బలిపశువులా రోదిస్తోంటే, ''సరిగ్గా ఇప్పుడు... ఇప్పుడు నాకు ఆనందం. నీ గర్వాన్ని పూర్తిగా అణిచేశానన్న ఆనందం'' అంటూ మేకపిల్ల తలను తెగనరికిన కసాయివాడిలా ఆనందించాడు.

ఆ క్షణంలోనే నేను నిర్ణయించుకున్నాను. బుద్ధి తెలిసినప్పట్నుంచి నాకై నేను తీసుకున్న నిర్ణయం ఇదే కావచ్చు - ఈ పశువుకు మరోసారి నా ప్రాణముండగా లొంగిపోకూడదని.

అతడు నన్ను వదిలేసి బయటకు వెళ్ళిపోయాడు. నేను కొన్ని క్షణాలసేపు నిశ్చలంగా పడుకొని ఆలోచించాను. నేను మళ్ళీ అమ్మా నాన్నల దగ్గరకు వెళ్లలేను. వాళ్ళ దృష్టిలో నా సమస్య చాలా చిన్నది. ఏ ఫ్రెండ్స్‌కు చెప్పుకున్నా ఈ మాటే అంటారు. ''ఇట్స్ ఎ మైనర్ ప్రాబ్లెమ్... ఎలాగో అడ్జస్టయిపోవాలి'' అంటారు. కాబట్టి నాకిక ఏ దారీ లేదు. ఈ గదిలో అతని ఉక్కు పాదాల కింద పడి నలిగి నశించిపోవాలి లేదా నాకై నేనే ఈ ప్రాణాల్ని అంతం చేసుకోవాలి. అతని చేతిలో పడి బలిపశువులా మరణించడం కంటే నా ప్రాణాల్ని నేనే తీసేసుకోవడం ఎన్నో విధాలుగా బెటర్ అనిపించింది. ఎలాగైనాసరే, అతడు వచ్చేలోగా ఈ లోకానికి గుడ్‌బై చెప్పేయాలని నిర్ణయించుకున్నాను. కానీ, వెళ్ళేముందు మీకు కనీసం మీరైనా నన్ను అర్థం చేసుకుంటారన్న నమ్మకంతో - ఒక ఉత్తరం రాసి పోస్ట్ చెయ్యాలని, ఆ తర్వాతే నా నిర్ణయాన్ని అమలుచెయ్యాలని అనుకొని మీకీ ఉత్తరం రాశాను. బయటకు వెళ్ళి పోస్ట్ చేస్తాను. కనీసం మీరైనా నా కథను నలుగురికీ చెప్పండి. నా సమస్య సమాజం అనుకుంటున్నంత మైనర్ ప్రాబ్లెమ్ కాదనీ, నా మనస్సు, నా శరీరం ఎంత భయంకరమైన క్రౌర్యానికి బలైపోయాయో, ఎన్నెన్ని గాయాలు నా శరీరాన్ని మనసును తూట్లు తూట్లుగా పొడిచాయో, ఏ తప్పూ చేయని నేను ఇంత అమానుషమైన శిక్షకు ఎందుకు గురికావలసి వచ్చిందో, నాకు మరణం తప్ప మరోదారి లేని పరిస్థితి ఎందుకు ఏర్పడిందో - కనీసం మీరైనా నలుగురికీ చెప్పండంకుల్... మీరైనా చెప్పండి.

మీకీ ఉత్తరం చేరేటప్పటికి భౌతికంగా నేనీ ప్రపంచంలో ఉండను.

మీ...

సృజన

ఉత్తరం చదవడం పూర్తిచెయ్యగానే నా శరీరమంతా చెమటతో నిండిపోయింది. లోపల ఎక్కడో వణుకు కూడా ప్రారంభమైంది.

వెంటనే కవరు మీదున్న పోస్టాఫీసు ముద్ర చూశాను. మలక్‌పేటలో ఈ ఉత్తరాన్ని పోస్టుచేసి మూడు రోజులైంది.

నేను వెంటనే బయటకు వెళ్ళి పబ్లిక్ టెలిఫోన్ బూత్‌నుంచి వెంకట్రామయ్య ఇంటికి ఫోన్ చేశాను. వాళ్ళబ్బాయి మాట్లాడాడు. సృజన బాత్‌రూమ్‌ని క్లీన్ చెయ్యడానికి వాడే

ఫినాయిల్ బాటిల్ మొత్తం తాగేసిందట. లక్కీగా పక్క పోర్షన్‌లో ఉండేవాళ్ళు గమనించి వెంటనే ఆమెను హాస్పిటల్‌లో జాయిన్ చేయించి వెంకట్రామయ్య ఇంటికి ఫోన్ చేశారట. స్టమక్ వాష్ చేసి ఆమెను రక్షించారట. ''షీ ఈజ్ నౌ అవుటాఫ్ డేంజర్ అంకుల్. హాస్పిటల్‌నుంచి నిన్ననే డిశ్చార్జ్ చేశారు'' అన్నాడతడు.

గుండెనిండా ఊపిరి పీల్చుకున్నాను. నేను వెంటనే హైదరాబాద్‌కు వెళ్ళి సృజనను చూశాను. నన్ను చూడగానే సృజన కళ్లల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి. అక్కడే ఉన్న కిషోర్, ''ఇందులో నా తప్పేమీ లేదంకుల్'' అంటూ ఏదో చెప్పబోయాడు. ఆ ఇంట్లో ఇంకా అతన్ని అల్లుడిలాగే ట్రీట్ చేయడం నన్ను ఆశ్చర్యపరిచింది.

''దయచేసి నువ్వు మొదట బయటకెళ్ళు'' అన్నాను అతనితో.

సృజన నన్ను దగ్గరకు రమ్మని పిలిచింది. నేను వెళ్ళాను. ''అతడు నాకు మరోసారి కనబడకుండా చెయ్యండంకుల్.. ప్లీజ్'' అంటూ బిగ్గరగా ఏడ్చింది సృజన.

''అతడు నీ జీవితంలో మళ్ళీ అడుగుపెట్టకుండా చేసే బాధ్యత నాది. ఆ విషయం ఇక నాకు వదిలెయ్'' అన్నాను.

వెంకట్రామయ్యనూ, సుమతినీ ఒప్పించి సృజనను నాతో మా ఇంటికి తీసుకొచ్చాను. కొద్దిరోజుల తర్వాత ఆమెనో ప్రైవేట్ కాలేజీలో లెక్చరర్‌గా చేర్పించాను.

సృజన మళ్ళీ కిషోర్ ముఖం చూడలేదు. ★

(ఇండియా టుడే - 2 సెప్టెంబర్ 1997)